ముందుంది మంచికాలం!

జిల్లాలో అంచనాల పరంగా పరిస్థితి ఇలా..

సీసీ రోడ్లకు : సుమారు రూ. 100 కోట్లు

బీటీ రోడ్లకు : సుమారు రూ. 30 కోట్లు

అధ్వానంగా మారిన యాడికి మండలం చందన-ధైవాల మడుగురోడ్డు



కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్..!

కూటమి పార్టీలు అధికారంలోకి రావడంతో గ్రామీణ రోడ్ల (సీసీ రోడ్లు) దశ మారనుంది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని ప్రతి మండలానికి రోడ్ల అభివృద్ధి కోసం రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో నివేదికను తయారు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ లెక్కన జిల్లా వరకు సుమారు రూ. 100 కోట్ల వరకు అంచనా నివేదిక తయారు కానున్నట్లు ఆశాఖ వర్గాల సమా చారం. నూతన ప్రభుత్వం గ్రామీణ రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో ఆయా ప్రాంతాల ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

- అనంతపురం సిటీ

ఒక్కో మండలానికి రూ.3 కోట్లతో అంచనా నివేదిక

కూటమి ప్రభుత్వం రాకతో పల్లె రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం

నివేదిక తయారు చేయడంలో నిమగ్నమైన అధికారులు



యాడికి మండలం పచ్చారు మేకలపల్లి- చందన రోడ్డు ఇలా..

ఒక్కో మండలానికి రూ.మూడు కోట్లు

గత వైసీపీ పాలనలో గ్రామీణ రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ విషయంపై ప్రతిపక్షాలు ప్రశ్నించినా అప్పటి వైసీపీ సర్కార్ అస్సలు పట్టించుకోదు. ఈ నేపథ్యంలో కూటమి పార్టీలు అధికారంలోకి రావడం.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంచాయతీ రాజ్‌శాఖపై దృష్టి సారించారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం ఒక్కో మండలానికి రూ. మూడు కోట్లు చెప్పున అంచనా నివేదిక పంపాలని ఆ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ లెక్కన జిల్లాలో 31 మండలాలతో పాటు అనంతపురం అర్బన్ పరిధిలోని నాలుగు పంచాయతీలు కలిసి చూస్తే.. సుమారు రూ. 100 కోట్ల వరకు అంచనా నివేదికలు తయారు కానున్నట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ఈ పనులన్నీ కూడా ఉపాధి హామీ పథకం కింద చేయనున్నారు. ఈ పనులన్నీ వచ్చే మార్చి 31కి పూర్తి చేయాలని ప్రభుత్వం షరతు విధించింది. అలాగే బీటీ రోడ్ల పరంగా కూడా నియోజకవర్గానికి రూ. 4 కోట్ల చెప్పున అంచనాలు పంపాలని ఆదేశించారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ఈ లెక్కన బీటీ రోడ్ల పరంగా.. సుమారు రూ. 30 కోట్ల వరకు అంచనా నివేదిక ఉండనుంది.

ఐదేళ్లలో రెండుసార్లే నిధులు...

గత వైసీపీ సర్కార్ గ్రామీణ రహదారులను పూర్తిగా విస్మరించింది. ఐదేళ్ల పాలనలో కేవలం రెండు దఫాలుగా మాత్రమే నిధులు కేటాయించి మమ అనిపించింది. దీంతో రోడ్ల అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. జిల్లాలో ఉరవకొండ, రాప్తాడు, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజవర్గ పరిధి ప్రాంతాల్లో గ్రామీణ రహదారులు ఎక్కువ శాతం దెబ్బతిన్నట్లు ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది. గత సర్కార్ రెండుసార్లు మాత్రమే నిధులు కేటాయించి గ్రామీణ రహదారులను గాలికి వదిలేసిందనే విమర్శలు ఉన్నాయి. ఈక్రమంలోనే గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి.

నిమగ్నమైన అధికారులు..

గ్రామీణ ప్రాంతాల్లో కొత్త సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే ఆశాఖ అధికారులు కూడా ఆ దిశగా ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల వారిగా.. ఉన్నతాధికారులు బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాల ప్రజలు, సర్పంచ్‌లు, ఎమ్మెల్యేలతో చర్చించి రోడ్ల నివేదికను తయారు చేయడంలో తలమునకలైనట్లు సమాచారం. వచ్చే వారం రోజుల్లో ఈ నివేదిక తయారుకానున్నట్లు తెలుస్తోంది. గత వైసీపీ సర్కార్ రోడ్ల పరంగా బిల్లులు మంజూరు చేయడంలో ఏళ్ల తరబడి జాప్యం చేయడంతో ఎక్కడికక్కడ కాంట్రాక్టర్లు ఎక్కువ శాతం దెబ్బతిన్నారనే విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్ల అంచనాలు తయారు చేయమని ప్రభుత్వం ఆదేశించినా.. అధికారులు నివేదిక తయారు చేసినా.. ఆశించిన స్థాయిలో కాంట్రాక్టర్లు పనులు చేస్తారో..? లేదో.. అన్న సందిగ్ధం ఆశాఖ వర్గాల్లో నెలకుంది.

ప్రభుత్వం అంచనా నివేదిక కోరింది



ప్రస్తుత ప్రభుత్వం జిల్లాలోని గ్రామీణ రహదారులు, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి తగిన అంచనా నివేదిక తయారు చేసి అందజేయమని ఆదేశాలు జారీ చేసింది. అదే పనిలో అధికారులందరూ నిమగ్నమయ్యారు. అతి త్వరలోనే తగిన నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం. పెద్దఎత్తున అంచన నివేదికలను ప్రభుత్వం కోరడం శుభపరిణామం. ఈ పనులను వచ్చే మార్చిలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం షరతూ విధించింది.

- కేవీ ప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ ఎస్‌ఈ

బాధ్యతలు చేపట్టిన ఏఎస్పీ రమణమూర్తి



బాధ్యతలు స్వీకరిస్తున్న రమణమూర్తి

అనంతపురం క్రైం, ఆగస్టు 21: జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా డీవీ రమణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం పీటీసీలో పనిచేస్తున్న రమణమూర్తిని పరిపాలనా విభాగం అదనపు ఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పలువురు ఏఎస్పీలు, సీఐలు, ఇతర సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కలిసి పండుగ చేసుకుందాం..!

ఇన్‌చార్జి జేసీ రామకృష్ణారెడ్డి



చర్చిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి

అనంతపురం టౌన్, ఆగస్టు 21: వినాయక చవితి విశిష్టతను కాపాడుకునేందుకు కలిసి పనిచేద్దామని ఇన్‌చార్జి జేసీ రామకృష్ణారెడ్డి నిర్వాహకులకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో అధికారులు, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సహజ రంగులతో చేసిన మట్టి వినాయక ప్రతిమలతో పండుగను జరుపుకోవాలని ఆయన సూచించారు. విగ్రహాల తయారీ, నిమజ్జనంలో కోర్టు ఆదేశాలను పాటించాలని అన్నారు. మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ, మున్సిపల్, కార్పొరేషన్, పంచాయతీ రాజ్, పోలీసు, కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. సమావేశంలో అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మనం మనం.. బరంపురం..!



కంబదూరు: తోటలోనే వదిలేయడంతో ఎర్రగా మాగిన టమోటా

సర్దుకున్న మండీ, లారీ అసోసియేషన్లు, బయ్యర్లు

● కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో యధాతథ స్థితి ● రైతుల పరిస్థితి ఏమిటో..!

అనంతపురం రూరల్/ కళ్యాణదుర్గం, ఆగస్టు 21: కక్కలపల్లి టమోటా మార్కెట్ రెండు రోజుల తరువాత చల్లబడింది. అంటే.. సమస్య పరిష్కారమైనట్లు కాదు..! మార్కెట్ శక్తులలో కీలకమైన మండీ, లారీ అసోసియేషన్లు, బయ్యర్లు సర్దుకున్నారు. బయటి వాహనాల నుంచి భారీగా వసూళ్లకు దిగడంతో సోమవారం బయ్యర్లు రోడ్డెక్కారు. రికార్డులను లాక్కుంటున్నారని వాహనదారులు ఆందోళనకు దిగారు. ఆ రాత్రికి బెదిరింపులు రావడంతో కొందరు అజ్ఞాతంలోకి వెళ్లారు. మరుసటి ఉదయాన్నే బయ్యర్లు వేలంపాటలను బహిష్కరించారు. దీంతో వేల టన్నుల టమోటా దిగుబడులు మార్కెట్‌లో పేరుకుపోయాయి. దిక్కుతోచక రైతులు రోడ్డెక్కారు. మార్కెట్ రచ్చ రచ్చ అయింది. హైవేపై ధర్నా కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి ఆరా తీయడంతో మొదటికే మోసం వస్తుందని పోలీసుల సమక్షంలో పంచాయితీ పెట్టుకున్నారు. రైతుల సంగతి అటుంచి.. సంఘాలవారు, బయ్యర్లు ఏకమయ్యారు. కలిసి మెలిసి 'వ్యాపారం' చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ పరిణామాలు రైతులకు అనుకూలమా.. ప్రతికూలమా అంటే.. రెండోదే అనాలి..! గిట్టుబాటు ధర ఇస్తారో లేదో, వచ్చిన దిగుబడులను సకాలంలో కొంటారో లేదో అన్న దిగులు అన్నదాతలను వేధిస్తోంది. గొడవ జరక్కుంటే చాలు అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కానీ మార్కెట్ చట్రంలో నలిగిపోతున్న మట్టి మనిషికి న్యాయం చేయాలన్న ఆలోచన ఎవరూ చేసినట్లు కనిపించడం లేదు.



హైవేపై మంగళవారం ఆందోళనకు దిగిన రైతులు



కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా నిల్వలు

200 టన్నులు నో సేల్

అక్రమ వసూళ్లు, అసోసియేషన్లు.. బయ్యర్ల వివాదాల కారణంగా రెండు రోజుల్లో రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయారు. సుమారు 200 టన్నులు నోసేల్ జాబితాలో చేరాయి. ఇవన్నీ దిబ్బల పాలయ్యాయి. కిలో కనీసం రూ.5 అనుకున్నా.. రెండు రోజుల్లో రైతులు రూ.10 లక్షలు నష్టపోయినట్లు..! రెండో రోజు టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ రంగప్రవేశంతో కాస్త ఆలస్యంగానైనా వేలంపాటలు మొదలయ్యాయి. లేదంటే నష్టం రెట్టింపునకు మించి ఉండేదని రైతులు అంటున్నారు. 'అప్పు చేసి పెట్టుబడి పెడుతున్నాం. ఎంతో కష్టపడి పంట పండిస్తున్నాం. మార్కెట్‌లో పరిస్థితుల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నాం. మండీ, లారీ ఇతర అసోసియేషన్లు వసూలు చేసే సొమ్ము భారం మాపైనే పడుతోంది. గిట్టుబాటు ధర లభించడం లేదు. మండీ వ్యాపారులు దిగుబడులను అమ్మినందుకు పది శాతం కమీషన్ తీసుకుంటున్నారు. వందకు ఐదు బాక్సులు మినహాయిస్తున్నారు. మండీల నిర్వాహకులకు రెండు, బయ్యర్లు మూడు బాక్సులు తీసేస్తున్నారు. ఇలా అయితే మేము బాగుపడేది ఎన్నడు..?' అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది 800 టన్నులు

ఏటా జూన్ నుంచి ఫిబ్రవరి వరకు ఎనిమిది నెలలపాటు టమోటా మార్కెట్ జరుగుతుంది. ఆ సమయంలో వర్షాలు పడితే టమోటా నీరుకాయలు పడి రైతులు తీవ్రంగా నష్టపోతారు. గంటల వ్యవధిలో కాయలు దెబ్బతింటాయి. గత ఏడాది కక్కలపల్లి మార్కెట్‌లో 800 టన్నుల కాయలు నోసేల్ కింద పడ్డాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే ఎనిమిది లక్షల కిలోల టమోటా దిబ్బలపాలైంది. కిలో రూ.5తో లెక్కకట్టినా రూ.40 లక్షలు నష్టపోయినట్లు. ఈ ఏడాది మార్కెట్ ప్రారంభం నుంచి దాదాపు 250 టన్నులు నోసేల్ కింద పడిపోయాయి. ఇందులో గడిచిన నాలుగైదు రోజులవే 200 టన్నులు ఉన్నాయి.

సారీలతో సర్దుకున్నారు..

కక్కలపల్లి మార్కెట్ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. వ్యవహారాన్ని చక్కదిద్దాలని స్థానిక ప్రజాప్రతినిధులకు, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు అందినట్లు మార్కెట్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి లారీ, మండీ అసోసియేషన్ నాయకులు, బయ్యర్లను పోలీసు ఉన్నతాధికారులు పిలిపించినట్లు తెలిసింది. రైతులను రోడ్డుక్కెంచి ధర్నాలు చేయించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇంకోసారి ఇలా జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు చెబుతున్నారు. దీంతో అసోసియేషన్లవారు, బయ్యర్లు సారీలు చెప్పుకుని చేతులు కలిపినట్లు తెలిసింది. ఇతర ప్రాంతాల వాహనాలను మార్కెట్‌లోకి అనుమతిస్తామని, అయితే అసోసియేషన్ వాహనాలు రెండు, బయటి వాహనం ఒకటి చొప్పున (2:1 నిష్పత్తిలో) లోడింగ్ అయ్యేలా సర్దుకున్నారని మార్కెట్‌లో చర్చ జరుగుతోంది. ఒప్పందాలు ఎలా ఉన్నా.. రైతులకు నష్టం కలగకుండా అధికారులు ఎలాంటి సూచనలు చేశారో తెలియడం లేదు. అసలు ఆ పంచాయితీలో రైతుల ప్రస్తావన వచ్చినట్లే కనిపించడం లేదు.

ప్రజాప్రతినిధుల వార్నింగ్..?

టమోటా మార్కెట్‌లో అక్రమ వసూళ్లపై స్థానిక ప్రజాప్రతినిధులు సీరియస్ అయినట్లు సమాచారం. రైతులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించవద్దని గట్టిగానే వార్నింగ్ ఇచ్చారని మార్కెట్‌లో చర్చ జరుగుతోంది. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించినట్లు సమాచారం. గొడవల నేపథ్యంలో రెండు రోజులుగా వసూళ్ల పర్వం ఆగిపోయింది. మునుముందు ఏం జరుగుతుందో తేలాల్సి ఉంది.

100 బాక్సులు నో సేల్..



మూడు ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. వారం క్రితం 16 కిలోల టమోటా బాక్స్ రూ.400 పలికింది. ఇప్పుడు ధరలు అమాంతం పడిపోయాయి. కక్కలపల్లి మార్కెట్‌కు వంద బాక్సుల టమోటా తీసుకెళితే.. నో సేల్ అనేశారు. కష్టపడి పండించిన పంటను అమ్ముకోలేకపోయాను. ఇలా అయితే పంటలు ఎలా పండించాలి..? మా భవిష్యత్తు ఏమిటో అర్థం కావడం లేదు.

- శ్రీనివాసులు, కంబదూరు

కొనడంలేదు..



టమోటా ధరలు అమాంతం పడిపోయాయి. మొన్నటివరకు బాక్సు రూ.300 ప్రకారం కొనుగోలు చేశారు. ఇప్పుడు నో సేల్ అంటున్నారు. కక్కలపల్లి మార్కెట్‌కు తీసుకువెళ్లిన 75 బాక్సులకు వదిలేసిరావాల్సి వచ్చింది. రెండు ఎకరాల్లో రూ.2 లక్షలు వరకు ఖర్చు చేసి పంట పండించాను. పెట్టుబడి కూడా దక్కకుండా పోయింది.

- ఈరన్న, శెట్టూరు

నట్టేట మునిగాం..



రెండున్నర ఎకరాల్లో రూ.2 లక్షల వరకు ఖర్చు చేసి టమోటా సాగు చేశాను. పెట్టుబడి కూడా దక్కలేదు. పతనమైన టమోటా ధరలతో నట్టేట మునిగాం. 120 బాక్సులు కక్కలపల్లి మార్కెట్‌కు తీసుకెళితే నో సేల్ అన్నారు. దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. టమోటా సాగు చేయాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం టమోటా రైతులను ఆదుకోవాలి.

- వీరారెడ్డి, కుందుర్పి

హైవే.. కంపు కంపు..!

ఫొటోలను చూసి వాగులో వంకలో అనుకోకండి. ఇదంతా అనంతపురం నగర శివారులో.. జాతీయ రహదారి పక్కన డ్రైనేజీ నీరు. భారీ వర్షాలకు ఎటు వెళ్లాలో తెలియక.. బెంగుళూరు-హైదరాబాదు 44వ నంబరు జాతీయ రహదారి సర్వీసు రోడ్లను ముంచెత్తింది. కక్కలపల్లి క్రాస్‌లోని ఈ మురుగునీటి సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందో తెలియదు. వర్షం కురిసిందంటే ఈ దారిలో వెళ్లేవారికి నరకం కనిపిస్తుంది. కక్కలపల్లి క్రాస్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్ పక్కన డ్రైనేజీ కాలువ ఉండేదీ. కాలువను ఆక్రమించి నిర్మాణం చేపట్టారు. వర్షపునీరు ప్రవహించేందుకు ఏర్పాటు చేసిన మోరీని మట్టితో పూడ్చేశారు. ఈ దారి రుద్రంపేట-కక్కలపల్లి పంచాయతీలకు మధ్యలో ఉండటంతో సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కక్కలపల్లి టమోటా మార్కెట్ ప్రాంతం సైతం వర్షపు నీటితో నిండిపోయింది. ఆ మార్గంలో ప్రయాణించే గ్రామీణ ప్రజలు, కాలనీలవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యంత్రాలతో తాత్కాలికంగా బుధవారం కాలువను తవ్వారు. ఇంకో వర్షం వస్తే అదే మట్టితో అది పూడిపోతుంది. శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

- అనంతపురం రూరల్



కక్కలపల్లి క్రాస్ వద్ద సర్వీసు రోడ్డు దుస్థితి



మురుగునీరు.. వర్షపు నీటితో నిండిన సర్వీసు రోడ్డు



వాహనదారుల ఇక్కట్లు



కక్కలపల్లి టమోటా మండీ రోడ్డు దుస్థితి

మురిపెం తీరకనే మృత్యువు

వంగనూరు వద్ద లారీని ఢీకొన్న కారు.. దంపతుల సహా ముగ్గురి మృతి



ప్రతాప్‌రెడ్డి, ప్రమీల, వెంకటలక్ష్మి (ఫైల్)



లారీని ఢీకొన్న కారు

తాడిపత్రి, ఆగస్టు 21: మండల పరిధిలోని వంగనూరు గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రతాప్‌రెడ్డి (25), ప్రమీల (22), వెంకటలక్ష్మి (45) అనే ముగ్గురు మృతిచెందారు. ఇదే మండలంలోని గదరగుట్టపల్లి గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి, ప్రమీలకు నాలుగు నెలలక్రితమే ప్రేమ వివాహం జరిగింది. ప్రతాప్‌రెడ్డి కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. కడప జిల్లా వేంపల్లిలో బంధువుల ఇంట కేశఖండన కార్యక్రమం ఉండటంతో ఈ నెల 20న మంగళవారం తన భార్య ప్రమీల, అత్త వెంకటలక్ష్మితో కలిసి ప్రతాప్‌రెడ్డి కారులో వెళ్లాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం అర్ధరాత్రి ముగ్గురూ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. తాడిపత్రి మండలం వంగనూరు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో ప్రతాప్‌రెడ్డి, ప్రమీల దంపతులు అక్కడికక్కడే మృతిచెందారు. కొన ఊపిరితో ఉన్న వెంకటలక్ష్మిని అంబులెన్స్ ద్వారా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న ప్రతాప్ రెడ్డి తల్లిదండ్రులు ఈశ్వరరెడ్డి, నాగలక్ష్మమ్మ కన్నీరుమున్నీరయ్యారు. కొడుకు ఇష్టపడ్డాడని ప్రేమ వివాహానికి అంగీకరించామని, ఇంతలోనే ఘోరం జరిగిపోయిందని గుండెలు బాదుకున్నారు. బడలిక కారణంగా కారు నడిపే సమయంలో ప్రతాప్‌రెడ్డి నిద్రమత్తులో ఉండవచ్చని, అందుకే ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ప్రతాప్ రెడ్డి స్వస్థలం తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి కాలనీ కాగా, వివాహం జరిగిన అనంతరం అత్తగారి ఊరు గదరగుట్టపల్లిలో ఉంటున్నాడు.

వాన.. వరద..!

116 చెరువులకు నీరు

అనంతపురం అర్బన్/క్లాక్‌టవర్, ఆగస్టు 21: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా బెళుగుప్పలో మండలంలో 89.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. రాయదుర్గం మండలంలో 85.4 మి.మీ., వజ్రకరూరు 82.6, కళ్యాణదుర్గం 80.2, కూడేరు 78.4, పెద్దవగుడూరు 65.2, ఉరవకొండ 62.4, గుత్తి 60.8, పామిడి 53.8, కంబదూరు 45.6, గుమ్మఘట్ట, రామగిరి 44.6, 42.6, విడపనకల్లు 42.4, గుంతకల్లు, రాప్తాడు 40.4, కనగానిపల్లి 40.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 39.6 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. బెళుగుప్ప సమీపంలోని పెద్ద వంక బ్రిడ్జిపై నీరు పారుతోంది. నీటి ఉధృతికి టిప్పర్ బ్రిడ్జి మీదనుంచి కొట్టుకుపోయి వంకలో పడింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఆ మార్గంలో గంటల తరబడి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి.

పొంగి పొర్లుతున్నాయ్..

అనంతపురం జిల్లాలోని 31 మండలాల పరిధిలో మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో 301 చెరువులు ఉన్నాయి. వీటిలో 116 చెరువులకు వర్షపు నీరు చేరింది. వీటిలో 21 చెరువులు పొంగి మరువ పారింది. 9 చెరువులు 75 శాతం, 19 చెరువులు 50 శాతం, 67 చెరువులు 25 శాతం నిండినట్లు అధికారులు తెలిపారు. పామిడి మండలం రామగిరి చెరువుకు గండి పడడంతో నీరు పెద్దఎత్తున వృథా అవుతోంది.

రూ.4.4 కోట్ల పంట నష్టం

అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు 926.74 హెక్టార్లల్లో రూ.4.4 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో 122.74 హెక్టార్లల్లో రూ.2.15 కోట్ల విలువైన టమోటా, బీర, కళింగర, ఎండు మిరప, చీనీ, పచ్చిమిరప, అరటి, మునగ, బెండ తదితర పంటలు ఉన్నాయి. మరో 804 హెక్టార్లల్లో రూ.2.25 కోట్ల విలువైన మొక్కజొన్న, కంది, వరి, వేరుశనగ, పత్తి, పెసర తదితర పంటలు దెబ్బతిన్నాయి.

పామిడి మండలం రామగిరి చెరువుకు గండి పడటంతో వృథా అవుతున్న నీరు



ఎంత పెద్ద చేపనో..!



యాడికి, ఆగస్టు 21: బుధవారం యాడికిలో 25కిలోల బరువున్న చేప ఒకటి విక్రయానికి వచ్చింది. దానిని చూసిన స్థానికులు అమ్మో! ఇంత పెద్ద చేప అంటూ నోరెళ్లబెట్టారు. చేపను విక్రయానికి తీసుకువచ్చిన వ్యక్తితో వివరాలు ఆరాతీయగా మండల సరిహద్దులో ఉన్న పెండేకల్లు డ్యాం నుంచి తీసుకువచ్చినట్లు తెలిపాడు. అంతపెద్ద చేపను కొనడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో చికెన్ దుకాణ యజమానికి రూ.2వేలకు విక్రయించి వెళ్లిపోయాడు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న శివప్రసాద్ యాదవ్

అనంతపురం కల్చరల్/క్రైం, ఆగస్టు 21: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ అన్నారు. సమాజంలో సెక్స్ వర్కర్లకు సమాన హక్కులు, ప్రాథమిక హక్కులు ఉన్నాయన్నారు. వారికీ చట్టాలు వర్తిస్తాయని వివరించారు. బుధవారం రాజహంస డీలక్స్ కన్వెన్షన్ హాల్‌లో సంగ్రామ్ సంస్థ, నేషనల్ నెట్‌వర్క్ ఆఫ్ సెక్స్ వర్కర్స్, సింధూర ఆర్గనైజేషన్, ఝాన్సీ లక్ష్మీ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసులు సెక్స్ వర్కర్లకు సముచిత గౌరవం ఇవ్వాలని సూచించారు. సెక్స్ వర్కర్లందరూ స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయవాది పద్మజ మాట్లాడుతూ జీవనోపాధికోసం మాత్రమే కొందరు స్వచ్ఛందంగా ఈ వృత్తిని ఎంచుకున్నారని, అలాంటివారిని బలవంతంగా ప్రేరేపించడానికి వీలులేదని, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత వ్యవస్థలపై ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, రెడ్స్ పీడీ చిట్టెప్ప, సెరా పీడీ కుల్లాయప్ప, శాంతి, పోతులయ్య, హరికృష్ణ, పద్మజ, నాగమణి, ఝాన్సీ, పుష్పావతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి



మృతి చెందిన నరసింహులు

గుత్తి రూరల్, ఆగస్టు 21: మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహులు(37) కూలీ మృతి చెందాడు. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన నరసింహులు అనంతపురం టమోటా మార్కెట్‌లో కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున నలుగురితో కలసి ఆటోలో అనంతపురానికి వెళ్తుండగా కొత్తపేట గ్రామశివారులోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నరసింహులు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృత్యుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నూతన జేసీ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను కలిసిన నూతన జేసీ

అనంతపురం టౌన్, ఆగస్టు 21: జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా శివనారాయణశర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరు వినోద్‌కుమార్‌ను కలిసి బాధ్యతలు తీసుకున్నారు. నూతన జేసీకి డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ మారుతి, పలువురు తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు అభినందనలు తెలిపారు.

అర్హులకు రుణాలు మంజూరు చేయాలి

పుట్టపర్తి, ఆగస్టు 21: అర్హులకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. కేటాయించిన లక్ష్యాలను బ్యాంకర్లు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో 2024-25 త్రైమాసిక ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యసాధన, ప్రగతిపై బ్యాంకర్లు, ప్రభుత్వశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులు, విద్యార్థులు, మత్స్యకారులు, చేనేతలు, పండ్లతోటల పెంపకం, పశుపోషణ, స్వయంసహాయక సంఘాలు, నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు సంబంధించి చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రుణాలు అందించి ఆర్థిక ఎదుగుదలకు ప్రోత్సాహం అందించాలన్నారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమలశాఖ జేడీ పద్మమ్మ, వ్యవసాయి అధికారి వైవీ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పశుసంవర్ధకశాఖ అధికారి శుభదాసు, ఉద్యానవనశాఖ అధికారి చంద్రశేఖర్, చేనేతజౌళిశాఖ అధికారి రమేష్, పరిశ్రమలశాఖ జనరల్‌మేనేజర్ చాంద్‌బాషా, ఆర్‌బీఐ ఎల్డీఓ గిరిధర్ పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కోటా కింద ప్రవేశాలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 21: జేఎన్‌టీయూలో ఇండస్ట్రియల్ కోటా కింద పీహెచ్‌డీ ప్రవేశాలను కల్పిస్తున్నట్లు బుధవారం డైరెక్టర్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ కిరణ్మయి తెలిపారు. ఇప్పటికే ఆర్‌సెట్ ద్వారా అడ్మిషన్స్ జరిగాయని. వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు ఆదేశాల మేరకు ఇండస్ట్రియల్ కోటా భర్తీచేస్తున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమలలో పనిచేస్తున్నవారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ఎగ్జిక్యూటివ్స్, ఆర్‌అండ్‌డీ సైంటిస్టులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఈ కోటాలో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. మాస్టర్ డిగ్రీలో కనీసం 55శాతం మార్కులు, 6.0సీజీపీఏ సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబరు 4లోపు రూ.5వేల డీడీతో దరఖాస్తుకు సంబంధించిన సర్టిఫికెట్స్‌ను జతపరిచి అడ్మిషన్స్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వేధింపుల కేసులో జైలు శిక్ష

గార్లదిన్నె, ఆగస్టు 21: వరకట్నం కేసులో ఓ మహిళ ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తమామలకు ఏడాది జైలు శిక్ష పడింది. గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన షరీఫ్‌కు తాడిపత్రి మండలం యర్రగుంటకు చెందిన హసీనాతో వివాహం జరిగింది. వీరికి పాప పుట్టింది. అప్పటి నుంచి హసీనాను భర్తతోపాటు అత్తమామలు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. దీంతో హసీనా 2020లో భర్త, అత్తమామలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా బుధవారం అనంతపురం మొబైల్ కోర్టులో విచారణ జరిగింది. ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు. అదేవిధంగా హసీనాకు నష్టపరిహారం కింద రూ.1.50లక్షలు ఇవ్వాలని న్యాయాధికారి సుజిన్‌కుమార్ తీర్పు ఇచ్చారు.

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితులు

హిందూపురం, ఆగస్టు 21: మేకల కాపరి జయమ్మను హత్యచేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సోమవారం మలుగూరుకు చెందిన జయమ్మ గ్రామ సమీపంలో మేకలు మేపుతుండగా ఆమెను హత్యచేసి 13 మేకలను ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఆంజనేయులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకుని మేకలు తరలించేందుకు ఉపయోగించిన బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనం పరిగి మండలం గొల్లపల్లికి చెందినదికాగా మేకలను ఎత్తుకెళ్లిన యువకుడిది సోమందేపల్లి మండలం ఈదులబళాపురంగా నిర్ధారణకు వచ్చారు. అనుమానితులను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈదులబళాపురానికి చెందిన యువకుడు మాత్రమే హత్యలో పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అయితే నిందితుడు గతంలో ఇతర నేరాలకు కూడా పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొద్ది నెలల క్రితం హిందూపురం మండలంలో పలు గ్రామాల్లో పశువులను ఎత్తుకెళ్లారు. వాటిలో కూడా ఈ నిందితుడి పాత్ర ఉన్నట్లు సమాచారం.

ప్రైవేటు 'సంక్షేమమే' లక్ష్యమా..?

- ప్రభుత్వ భవనాలున్నా అద్దె భవనాల్లోనే హాస్టళ్లు
- మండల కేంద్రాల్లోనూ ఇదే దుస్థితి

ఏటా రూ.1.80 కోట్లకుపైగా ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం



ఎమ్మార్సీ కార్యాలయంలో శింగనమల జడ్పీ బాలికల వసతి గృహం



నిరుపయోగంగా ఉన్న శింగనమలలోని ఎస్సీ బాలికల వసతి గృహం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 21: పేద విద్యార్థులకు విద్య, వసతి, నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాల వ్యవస్థ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారిపోతోంది. ప్రభుత్వ వసతి గృహాలున్నా వాటిలో కాకుండా అద్దె భవనాల్లో అది కూడా ఇరుకు గదులు అరకొర వసతులున్న భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీరి నిర్వాకంతో ఓ వైపు విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా మరోవైపు ప్రభుత్వ సొమ్ము వృథా అవుతోంది.

ప్రభుత్వ భవనాలున్నా..

సంక్షేమశాఖల అధికారులకు జిల్లా కేంద్రంలో అది కూడా నగర నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ భవనాలు కనిపించకపోవడం గమనార్హం. అవేమైనా వాడకానికి వీలులేని పరిస్థితుల్లో ఉన్నాయా అంటే ఒక్కో భవనంలో రెండు హాస్టళ్లు నిర్వహించే సామర్థ్యం ఉన్నవే. నగరంలో పలు ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నాయి. అయినా అధికారులు అద్దె భవనాల వైపే మక్కువ చూపుతున్నారు. ఫలితంగా నెలనెలా ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాలకు సంబంధించి ప్రైవేట్ భవనాల యజమానులకు రూ. 15 లక్షలకుపైగా అద్దె చెల్లించాల్సి దుస్థితి నెలకొంది.

- నగరంలోని అటవీశాఖ కార్యాలయం పక్కనే ఓ ప్రభుత్వ భవనం ఉంది. ఆ భవనంలో ఇదివరకూ విజిలెన్స్ కార్యాలయాన్ని నిర్వహించారు. సంవత్సర కాలంగా ఆ భవనం ఖాళీగా ఉంది. ఆ భవనాన్ని వినియోగిస్తే దాదాపు 400 మందికిపైగా విద్యార్థులకు వసతి కల్పించవచ్చు. అంటే రెండు హాస్టళ్లు అక్కడ నిర్వహించే వెసులుబాటు ఉంది.
- కలెక్టరేట్ సమీపంలో ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయం వెనుకవైపు ఎస్కేయూ, ఎస్సీ వెల్ఫేర్ అనుసంధానంగా ఏర్పడిన స్కియాడ్ భవనం ఉంది. ఆ భవనం దాదాపు నాలుగేళ్లుగా ఖాళీగా ఉంది. ఇప్పటికీ నూతన గదులతో ఆ భవనం చెక్కుచెదరలేదు. అందులోనూ దాదాపు రెండు హాస్టళ్లను నిర్వహించవచ్చు.
- నగరంలోని ఎస్సీ వెల్ఫేర్ వెనుకవైపు ఓ హాస్టల్ భవనం ఉంది. ఆ హాస్టల్ కెపాసిటీ దాదాపు 500 మందికిపైగా ఉంది. అయితే సకాలంలో ఆ భవనానికి మరమ్మతులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపడంతో ఆ భవనం శిథిలమైంది. ఇప్పటికీ ఆ భవనానికి మరమ్మతులు చేయిస్తే ఉపయోగంలో వచ్చే అవకాశం ఉంది.
- నగరంలోని దివ్యశ్రీ ఆస్పత్రి ఎదురుగా ఎస్సీ హాస్టల్ ఉంది. ఆ హాస్టల్ దాదాపు నాలుగేళ్లకుపైగా మూతపడింది. దానికి మరమ్మతులు చేపడితే రెండు హాస్టళ్లను నిర్వహించే అవకాశం ఉంది.
- శింగనమల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల వసతిగృహం కోసం ఓ భవనాన్ని నిర్మించారు. అయితే ఊరికి దూరంగా ఉందని ఆ భవనాన్ని వినియోగించుకోకపోవడంతో అందులో ప్రస్తుతం ఎమ్మార్సీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే శింగనమలలో ఎస్సీ బాలికల వసతి గృహం భవనాన్నీ వాడుకోకుండా గాలికొదిలేయడంతో ఆ భవనమూ ప్రస్తుతం ఖాళీగా ఉంటోంది. ఫలితంగా శింగనమల బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నారు.

ప్రత్యామ్నాయం పట్టదా..?

మండల కేంద్రాల్లో నిర్మించిన ప్రభుత్వ వసతి గృహాలను వినియోగించుకోవడంలో సంక్షేమశాఖల అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. కేవలం కళాశాలలకు దూరంగా ఉన్నాయన్న ఒకే ఒక్క కారణంతో ఆ భవనాలు వదిలి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ భవనాల్లోకి వసతి గృహాలకు మార్చేశారు. నిబంధనల మేరకు వసతిగృహాలకు ఏవైనా సమస్యలున్నా కళాశాలలకు దూరంగా ఉన్నా అందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆయా సంక్షేమ శాఖల అధికారులపై ఉంది. అయితే అటువైపు అధికారులు ఆలోచించకపోవడంతో ప్రభుత్వానికి తీరని నష్టం వాటిల్లుతోంది. దూరంగా ఉన్న హాస్టళ్లకు రవాణా సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి కళాశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కనీసం ఆయా సంక్షేమశాఖల అధికారులు ఆర్టీసీ వారితో చర్చలు జరిపిన దాఖలాలు లేవు. దూరంగా ఉందంటే ప్రైవేట్ భవనంలో మార్చాలనే ఒకే ఒక్క కాన్సెప్ట్‌ను సంక్షేమశాఖల అధికారులు ఎంచుకొంటున్నారు.

కాలేజీ హాస్టళ్ల సమస్య ఉంది

జిల్లాలోని పలు వసతి గృహాలు ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న మాట వాస్తవమే. అయితే ప్రభుత్వ భవనాలు లేని చోట మాత్రమే ప్రైవేట్ భవనాల్లో హాస్టళ్లు నిర్వహిస్తున్నాం. ఉన్న వసతిగృహాల్లో ఏవైనా సమస్యలుంటే వాటికి సంబంధించి రిపేరీలు చేయించి వినియోగించుకుంటున్నాం. ప్రీమెట్రిక్ హాస్టళ్లన్నీ దాదాపుగా సొంత భవనాల్లోనే నిర్వహిస్తున్నాం. కాలేజీ హాస్టళ్లకు మాత్రమే సమస్య ఉంది. మండల కేంద్రాల్లో హాస్టళ్లు ఉన్నప్పటికీ కాలేజీలకు దూరంగా ఉన్నాయి. ఫలితంగా విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ భవనాల్లో వసతి గృహాలు నిర్వహిస్తున్నాం.

- కుష్బూకొఠారీ, డీడీ, బీసీ, ఎస్సీ సంక్షేమశాఖలు



ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయం వెనుకవైపు ఉన్న స్కియాడ్ భవనం



దెబ్బతిన్న టమోటా పంటను చూపుతున్న రైతు చంద్రశేఖర్



మిర్చిపంటను చూపుతున్న రైతు పెద్దకేశవయ్య

వర్షానికి దెబ్బతిన్న పంటలు

నీట మునిగిన టమోటా, మిరప పంటలు
ఆవేదనలో రైతులు

ధర్మవరంరూరల్, ఆగస్టు 21: వర్షాలకు సాగుచేసిన పంటలు దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఏలుకుంట్ల గ్రామంలో రైతు పెద్దకేశవయ్య ఎకరాలో సాగుచేసిన మిరప, రైతు చంద్రశేఖర్ ఎకరాలో సాగుచేసిన టమోటా పంటలు నీటమునిగాయి. అంతేకాకుండా పలువురు రైతులు సాగుచేసిన వేరుశనగ, మొక్కజొన్న దెబ్బతిన్నాయి. మిరప, టమోటా కోతకు వచ్చిన దశలో వర్షం రావడంతో పూర్తిగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. హార్టికల్చర్ అధికారి గీతాంజలి పంటలను పరిశీలించారు. పంటనష్టంపై ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తామని తెలిపారు.

కళ్యాణదుర్గంలో బీడీ మంటలు

- కిందపడి పగిలిపోయిన పెట్రోల్ క్యాన్
- బీడీ అంటించుకుని.. అగ్గిపుల్ల పడేసిన పొగరాయుడు
- భారీగా చెలరేగిన మంటలు.. అదుపు చేసిన స్థానికులు



సీసీ పుటేజీలో రికార్డయిన బీడీ తాగుతున్న వ్యక్తి



వ్యాపించిన మంటలు

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 21: కళ్యాణదుర్గం మండల కేంద్రంలో పెట్రోల్ క్యాన్ కింద పడి పగిలిపోవడం, బీడీ తాగుతున్న వ్యక్తి అగ్గిపుల్ల పడేయటంతో భారీగా మంటలు చెలరేగాయి. స్థానికులు నీరు చల్లి మంటలను ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో జేఏఎస్ శెట్టి అండ్ సన్స్ పెట్రోల్ బంకు ఉంది. ఓ వ్యక్తి బుధవారం ఉదయం 20 లీటర్ల క్యాన్‌లో పెట్రోల్ పట్టించుకున్నాడు. క్యాన్‌ను తన ద్విచక్ర వాహనంపై పెట్టుకుని సమీపంలో ఉన్న ఓ మెడికల్ షాపు వద్దకు వెళ్లాడు. బైక్ ఆపి మెడికల్ షాప్‌లోకి అతను వెళ్లిన కాసేపటి పెట్రోల్ క్యాన్ కింద పడి పగిలిపోయింది. పెట్రోల్ మొత్తం రోడ్డు వెంబడి పారింది. అదే సమయంలో అక్కడికి సమీపంలో ఓ వ్యక్తి బీడీ అంటించుకుని అగ్గిపుల్లను రోడ్డుపై వేశాడు. పెట్రోలు అగ్గిపుల్లను తాకగానే భారీగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల ఉన్నవారు భయంతో పరుగులు తీశారు. రోడ్డు పక్కన ఉన్న ఓ ద్విచక్ర వాహనం పాక్షికంగా దగ్ధమైంది. మంటలు చెలరేగిన ప్రాంతానికి కేవలం పది అడుగుల దూరంలో పెట్రోల్ బంక్ ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దుకాణదారులు సంపులో ఉన్న నీటితో మంటలను ఆర్పివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు చేరుకుని సీసీ ఫుటేజీని పరిశీలిస్తేగానీ బీడీ కాల్చిన వ్యక్తి కారణంగా మంటలు చెలరేగినట్లు బయటపడలేదు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రవి (ఫైల్)

కళ్యాణదుర్గం, ఆగస్టు 21: అనంతపురం జిల్లా శెట్టూరు మండలం లింగదీర్లపల్లి గ్రామానికి చెందిన రైతు రవి(48) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రవికి నాలుగున్నర ఎకరాల పొలం ఉంది. బోరు బావుల తవ్వకానికి, వ్యవసాయ పెట్టుబడులకు రూ.6 లక్షలు అప్పు చేశాడు. వేరుశనగ పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీర్చలేక ఒత్తిడికి లోనయ్యాడు. ఇంట్లో సిమెంట్ దూలానికి బుధవారం తెల్లవారుజామున లుంగీ తో ఉరివేసుకున్నాడు. రైతు భార్య రేణుకమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సినీ ఫక్కీలో కిడ్నాప్

- ప్రతిఘటించి తప్పించుకున్న చిరు వ్యాపారి



బాధితుడిని విచారిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

బుక్కరాయసముద్రం, ఆగస్టు21: సినీ ఫక్కీలో జరిగిన ఓ చిరు వ్యాపారి కిడ్నాప్ జిల్లాలో కలకలం రేపింది. అయితే ఆ వ్యాపారి కిడ్నాపర్లను ప్రతిఘటించి మండల పరిధిలోని జంతులూరు గ్రామం వద్ద బయటపడ్డాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన మేరకు... అనంతపురం నగరంలోని తపోవనం ప్రాంతానికి చెందిన కుళ్లాయప్ప చీరలు, మిక్సీలు, వంట సామగ్రి వస్తువులను ప్రతి రోజు ద్విచక్రవాహనంలో తీసుకెళ్లి బుక్కరాయసముద్రం, నార్పల, శింగనమల మండలాల్లోని గ్రామాల్లో విక్రయించి పొట్టపోసుకునేవాడు. వ్యాపారం నిమిత్తం బుధవారం నార్పలకు వెళ్తుండగా... బుక్కరాయసముద్రం గాంధీనగర్ వద్ద కారులో నలుగురు వచ్చి కుళ్లాయప్పను కిడ్నాప్ చేశారు. కారులోనే మూడు గంటల పాటు నార్పల, బుక్కరాయసముద్రం పరిధిలోని పలు గ్రామాల్లో తిప్పారు. ముసుగువేసి కారులోనే చితకబాదారు. ఐదు నెలలుగా తిరుగుతున్నాం... ఇప్పుడు దొరికావ్ అంటూ చితకబాదారని కుళ్లాయప్ప వాపోయాడు.

ప్రతిఘటించడంతో... తప్పిన ప్రమాదం

పథకం ప్రకారం చిరు వ్యాపారి కుళ్లాయప్పను కిడ్నాప్ చేసి కారులోనే చితకబాదారు. చివరికి ఇంకా హత్య చేస్తారని భావించిన కుళ్లాయప్ప ... కారు డ్రైవర్ గొంతు గట్టిగా చేతులతో పట్టుకున్నాడు. దీంతో కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి కారు అదుపు చేయలేక జంతులూరు గ్రామం వద్ద రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొని చిన్న గోతిలో దించాడు. దీంతో కారు బయటకు రాకపోవడంతో కిడ్నాపర్లు జంతులూరు గ్రామం వద్ద నుంచి పరారీ అయ్యారు. అనంతరం 100కు ఫోన్ చేసి సమాచారాన్ని పోలీసులకు తెలిపినట్లు పేర్కొన్నారు. సీఐ వెంకటేశ్వర్లు బాధితుడుని అనంతపురం సర్వజన అస్పత్రికి తరలించారు. తన ద్విచక్రవాహనా న్ని కిడ్నాపర్లు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు బాధితుడు తెలిపారు.

ఎందుకీ కిడ్నాప్..?

చిరు వ్యాపారి కుళ్లాయప్పను పట్టపగలే ఎందుకు కిడ్నాప్ చేశారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కిడ్నాప్‌నకు ఉపయోగించిన కారు అనంతపురంలోని జనశక్తినగర్‌లో నివాసంటున్న ఓ వీఆర్వో పేరుమీద ఉన్నట్లు పోలీసులు విచారణలో తేలింది. అయితే ఆ వీఆర్వోను విచారించగా అదే కాలనీకి చెందిన అనిల్ అనే వ్యక్తి తన పేరుమీద కారు కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనిల్‌ను పోలీసులు విచారణ చేయగా ఆరు నెలల కిందట నగరంలోని ఓ ప్రైవేటు డ్రైవింగ్ స్కూలుకు లీజుకు ఇచ్చినట్లు సమాచారం. ఈ నెల 19న నలుగురు వ్యక్తులు ఆ డ్రైవింగ్ స్కూలు వద్దకు వెళ్లి తమ ఆధార్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చి, వారి ద్విచక్రవాహనంను డిపాజిట్టు చేసి కారును అద్దెకు తీసుకుని, అదే కారును కిడ్నాప్‌నకు ఉపయోగించారు. నిందితుల వివరాలను పోలీసులు ఇప్పటికే రాబట్టినట్లు తెలిసింది. ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసుల వర్గాల ద్వారా అందిన సమాచారం. బుక్కరాయసముద్రం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీడిపల్లికి 1,233 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 21 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 1233 క్యూసెక్కుల కృష్ణాజలాల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.886 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

25లోగా దరఖాస్తు చేసుకోండి: డీఈఓ

అనంతపురం విద్య, ఆగస్టు 21: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ, హైస్కూళ్లలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి 2024 ఏడాదికి సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను రెండు సెట్లు ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సంబంధిత ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ ఆఫీసుల్లో అందజేయాలన్నారు. దరఖాస్తుదారులకు కనీసం 15 ఏళ్ల బోధనానుభవం ఉండాలని, ఎలాంటి క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండకూడదన్నారు.

ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 21: జెన్‌ప్యాక్ట్ (ఎంఎన్‌సీ) కంపెనీలో కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీసెస్, వాయిస్ సపోర్టు విభాగాల్లో 1500 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్‌ఖయ్యూమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్, ఏదేని డిగ్రీ పూర్తి చేసి 2022, 2023, 2024 సంవత్సరాల్లో పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://బీఐటీ.ఎల్‌వై/46డబ్ల్యూజడ్‌క్యూజడ్6 లింక్ ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూ జరిగే తేదీ, స్థలం తదితర వివరాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం 9988853335ను సంప్రదించాలని కోరారు.

అనంతపురం డీఎస్పీ బదిలీ

అనంతపురం క్రైం, ఆగస్టు 21: అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్ బదిలీ అయ్యారు. ఆయనను ఏసీబీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. 14వ బెటాలియన్ డీఎస్పీగా ప్రసాద్‌రెడ్డిని నియమించారు.

బీపీఓ ఉద్యోగాలకు మేళా

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 21: వివిధ సంస్థల్లోని బీపీఓ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.20వేల నుంచి రూ.25వేల జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అర్హులని వివరించారు. 27న కళాశాలలో నిర్వహించే మేళాను ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8106399029, 8790172463, 778060993 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపుతాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



48వ డివిజన్‌లో రోడ్డుపై డ్రైనేజీ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఆగస్టు 21: నగరంలోని ముంపు ప్రాంతాలకు త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. భారీ వర్షం నేపథ్యంలో బుధవారం 48వ డివిజన్ సోమనాథ్ నగర్‌తోపాటు పలు కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. డ్రైనేజీల నుంచి నీరు పొంగిపొర్లి ఇళ్లలోకి చేరడంతో కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులును స్వయంగా పరిశీలించారు రోడ్లపై బురద, మురుగు పేరుకుపోవడంతో వెంటనే క్లీన్ చేయించాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. వంకలపై ఇష్టారాజ్యంగా ఆక్రమణలు కనిపిస్తున్నాయని, తద్వారా చిన్న పాటి వర్షాలకే డ్రైనేజీ నీరు రోడ్లపైకి వస్తోందన్నారు. పలు చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉందన్నారు. వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు.

చెరువును తలపిస్తున్న రజకనగర్



చెరువును తలపిస్తున్న కాలనీ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 21: నగరంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రజకనగర్ చెరువును తలపిస్తోంది. కాలనీ మొత్తం వర్షంనీరు చేరడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. మురుగు కాలవలు చిన్నగా ఉండడం, కొంత స్థలం ఆక్రమణకు గురికావడంతో వర్షం నీరు మొత్తం ఇళ్లలోకి చేరింది. రోడ్లలో వర్షం నీరు నిలవడంతో కాలనీ మొత్తం చెరువును తలపిస్తోంది.



రజకనగర్ స్కూల్‌లో నిలిచిన వర్షం నీరు

ఇక కాలనీలోని స్కూల్‌లోకి నీరు చేరడం, పాఠశాల భవనం నుంచి నీరు లీకేజీతో లోపలికి విద్యార్థులు వెళ్లలేక నానా అవస్థలు పడ్డారు. రహదారులు, మురుగు కాలవలు నిర్మించి వర్షం నీరు నుంచి విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నీట మునిగిన కాలనీలు



కురుగుంట వైఎస్సార్ కాలనీలో నీట మునిగిన ఇళ్లు

అనంతపురం రూరల్, ఆగస్టు 21: మండలంలో రెండురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. కురుగుంట వైఎస్సార్ కాలనీలోకి చాలా వరకు వర్షపు నీరు చేరుకున్నాయి. అక్కంపల్లి పంచాయితీ లోని సదాశివ్ కాలనీ, జయరామిరెడ్డి కాలనీలోకి వర్షపునీరు వచ్చి చేరాయి. కురుగుంటలో 300ఇళ్లు నీట మునిగాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మూడు పూటల భోజనసదుపాయాన్ని ఏర్పాటు చేశారు.



సదాశివన్‌కాలనీ సమీపంలో ప్రవహిస్తున్న వంక

భారీ వర్షానికి కూలిన సచివాలయం కప్పు



సచివాలయం పైకప్పు కూలిన దృశ్యం

శింగనమల, ఆగస్టు 21: మండలంలోని ఉల్లికల్లులో అద్దె భవనంలో నిర్వహిస్తున్న సచివాలయం భారీ వర్షానికి పైకప్పు కూలిపోయింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సచివాలయం ఉన్న అద్దె భవనం పైకప్పు కూలింది. ఈ ప్రమాదంలో మూడు కుర్చీలు, నాలుగు టేబుళ్లు ధ్వంసమయ్యాయి. కంప్యూటర్లు దెబ్బతినలేదని పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తెలిపారు.

బీసీ వార్డెన్ల సంఘం అధ్యక్షుడిగా మారుతీప్రసాద్



నూతన సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 21: బీసీ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మారుతీప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదివరకు జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న మస్తాన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో జిల్లా అధ్యక్ష స్థానం ఖాళీ ఏర్పడింది. బుధవారం నగరంలోని బీసీ బాయ్స్ నెం-2 ప్రీమెట్రిక్ హాస్టల్‌లో ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా మారుతీప్రసాద్, కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా ఈరన్నలను ఎంపిక చేశారు. ఏబీసీడబ్ల్యూఓలు రంగమ్మ, సుభాషిణి, గంగాద్రి, వార్డెన్లు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 21: ఆర్డీటీ గ్రామీణ బాలికల అథ్లెటిక్ ప్రాంతీయ స్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. అభివృద్ధి కోసం క్రీడలు అనే నినాదంతో జులై 23వ తేదీన ప్రారంభించిన ఆర్డీటీ గ్రామీణ బాలికల అథ్లెటిక్ ఏరియా స్థాయి పోటీల్లో 422 పాఠశాలల నుంచి 4286మంది బాలికలు 5క్రీడా విభాగాల్లో ప్రాతినిధ్యం వహించారు. బుక్కరాయసముద్రం, బత్తలపల్లి, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ, మడకశిర, శ్రీశైలం, ఆదోని ప్రాంతాల్లో చదువుతున్న గ్రామీణ క్రీడాకారిణులకు అవకాశం కల్పించారు. గెలుపొందిన క్రీడాకారులు కేంద్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆర్డీటీ క్రీడాపోటీల నిర్వాహకులు తెలిపారు.

సబ్‌ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 21: ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసిన ఆ సంఘం నాయకులు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేసిన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ మాట్లాడుతూ 2013 ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం మొత్తం నిధులలో ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే నిధులు ఖర్చు పెట్టాలన్నారు. జనరల్ స్కీంలో కలపరాదని, తాజా లెక్కల ప్రకారం సంపూర్ణంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ నిధుల ఖర్చు, చట్టం అమలుపై ప్రతి రెండు నెలలకు ఒకసారి సమీక్ష జరిపి సక్రమ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర కార్యవర్గసభ్యులు సోమశేఖర్, డాక్టర్ సైదన్న, డాక్టర్ నారాయణస్వామి, శ్యాంబాబు పాల్గొన్నారు.

ఇలాంటి పరిస్థితి రానివ్వను

● రూ.30లక్షలతో కల్వర్టులు, రోడ్లు నిర్మిస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



వంకను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్, ఆగస్టు 21: వర్షం నీటితో వస్తున్న ఇబ్బందుల నుంచి కాలనీ వాసులను కాపాడుకుంటామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని అక్కంపల్లి పంచాయతీ సదాశివన్ కాలనీలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వంక ఉధృతంగా పారుతోంది. కాలనీలోకి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే పరిటాల సునీత పంచాయతీ రాజ్ ఇతర విభాగాల అధికారులతో కాలనీలోకి వెళ్లారు. వంకనుంచి వస్తున్న నీటిని పరిశీలించారు. స్థానికులు తమ ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో నుంచి వెళ్లేందుకు మార్గం లేక పిల్లలను రెండు రోజులుగా స్కూల్ కూడా పంపించలేదని చెప్పుకొచ్చారు. సమస్య పరిష్కారానికి తీసుకోవాలసిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ దృష్టి సమస్యను తీసుకెళ్లారు. ఆమె మాట్లాడుతూ కాలనీలో వర్షపు నీటి శాశ్వత పరిష్కారం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రూ.30లక్షల నిధులతో ఇక్కడ పనులు చేపడుతామన్నారు. అందుకు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. వచ్చే వర్షాకాలంలోపు ఈసమస్య లేకుండా చేస్తామని చెప్పారు. మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, పామురాయి రఘు, చల్లాజయకృష్ణ, వెంకటనారాయణ, ప్రదీప్‌కుమార్, అంజన్‌రెడ్డి,మస్తాన్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి: టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఆమేరకు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలసి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వమే టమోటా మార్కెట్ ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూడాలన్నారు. ప్రస్తుతం కక్కలపల్లిటమోటా మార్కెట్‌లో పది శాతం కమీషన్ కాకుండా నాలుగుశాతం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో టమోటాకు అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పోతులయ్య, రాప్తాడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తగ్గని జూడాలు

● హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి



నగరంలో బైక్‌ర్యాలీచేపడుతున్న జూనియర్ డాక్టర్లు

అనంతపురం టౌన్, ఆగస్టు 21: కోల్‌కతాలో మహిళా డాక్టర్ హత్యాచార ఘటనపై జిల్లాకేంద్రంలో జూనియర్ డాక్టర్ల ఆందోళన బుధవారం కొనసాగింది. సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వందలాదిమంది పాల్గొని తమ నిరసనను తెలిపారు. అక్కడ నుంచి వందలాది మంది ర్యాలీగా బయలుదేరి సప్తగిరి సర్కిల్ చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి డాక్టర్‌ను చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేపట్టారు. ర్యాలీకి సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రమణయ్య, నారాయణ స్వామి సంఘీభావం తెలిపారు. సాయంత్రం డాక్టర్లు బైక్‌ర్యాలీ కొనసాగించారు. ఈ ఆందోళనకు మద్దతుగా సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. జడ్పీ కార్యాలయం నుంచి సర్వజన ఆస్పత్రి వరకు ప్రదర్శన కొనసాగించారు. సీఐటీయూ నాయకులు ఓబులు, నాగేంద్రకుమార్, నాగమణి, నాగభూషణం, సూర్యనారాయణ, రమాదేవి, పాల్గొన్నారు.

దోషులకు ఉరిశిక్ష విధించాలి



మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం విద్య, ఆగస్టు 21: వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులకు ఉరిశిక్ష వేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ స్పత్రి వద్ద రిలేదీక్షలు చేస్తున్న వైద్య విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. వారితోపాటు జాఫర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య కుళ్లాయిస్వామి, ఏఐవైఎఫ్ ఆనంద్, సంతోష్‌కుమార్, నాయకులు మంజునాథ్, ఉమామహేష్, వంశీ, తారక్ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌ను హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల నాయకుడు లింగన్న డిమాండ్‌చేశారు. హత్యాచారానికి నిరసనగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మోడల్ కళాశాల విద్యార్థులతో నీకేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ స్వర్ణలత, స్థానిక ప్రభుత్వ డాక్టర్ కార్తీక్, కళాశాల సిబ్బంది రెహనాబేగం, అరుణ, లక్ష్మీ, మీరా, ప్రతాప్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం



దత్త శివను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఆగస్టు 21: నగరంలోని అన్న క్యాంటీన్ కోసం దత్త శిల్ప్స్ అధినేత దత్త శివ రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. బుధవారం స్థానిక అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు రూ.లక్ష చెక్కును ఆయన అందజేశారు. దత్త శివను ఎమ్మెల్యే అభినందించారు. ఆయనకు పూల మాల వేసి శాలువ కప్పి, జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

టీడీపీ నాయకులకు సన్మానం : టీడీపీకి సైనికుల్లా పనిచేసిన పలువురు నాయకులను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సన్మానించారు. బుధవారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీ పీ కార్యాలయంలో రమేష్ బాబు, కమ్మూరి సికిందర్, నాగేంద్ర, గంగవరం అంజిలకు ఎమ్మెల్యే శాలువ కప్పి, జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

జేఎన్‌టీయూ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 21: జేఎన్‌టీయూ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు అధికారులకు సూచించారు. బుధవారం ఆయన పలువురు డైరెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ 21 నుంచి 28 వరకు నిర్వహించే ఆవిర్భావ వేడుకలకు డైరెక్టర్లు దుర్గాప్రసాద్, నారాయణరెడ్డిని సమన్వయ కర్తలుగా నియమించామన్నారు. వర్క్‌షాపులు, గెస్ట్ లెక్చరర్లు, స్పోర్ట్స్ సాంస్కృతిక తదితర ఈవెంట్స్‌ను నిర్వహించాలని సూచించారు. డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్‌తోపాటు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకించాలి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 21: రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరించి ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అన్నారు. బుధవారం ఎస్కేయూలో ఆ సమితి ఆధ్వర్యంలో ర్యాలీని ర్వహించి, నిసరన తెలిపారు. పార్లమెంట్‌లో తీర్మానం లేకుండా 341 ఆర్టికల్‌ను సవరించే అధికారం ఎవరికీలేదని నాయకులు విజయ్, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, తిరుమలేష్, రాజునాయక్, అనిల్ నాయక్ పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

గార్లదిన్నె, ఆగస్టు 21: మైనార్టీ గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు పరమేష్, గిరి డిమాండ్ చేశారు. మైనార్టీ పాఠశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక పాఠశాల విద్యార్థులతో కలసి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో 450 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. వారికి సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు ఇర్ఫాన్, రిజ్వాన్, మహమ్మద్, యూసుఫ్, ఖాదీర్, బాషా, ముస్తఫ్, ఆలీ, రాజు, విగ్నేష్ పాల్గొన్నారు.

వైభవంగా ద్వితీయ ఆరాధన

అనంతపురం విద్య, ఆగస్టు 21: జగద్గురు మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ద్వితీయ ఆరాధన బుధవారం వైభవంగా నిర్వహించారు. నగరంలోని జేఎన్టీయూ రహదారి నేతాజీ నగర్‌లో ఉన్న రవీంద్రస్వామీజీ గృహంలో శ్రీ గురురాయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా ఉదయం రాఘవేంద్రస్వామి, వెంకటేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పురుషసూక్త, శ్రీసూక్త, దుర్గాసూక్తి, రుద్రాభిషేక సహిత పంచామృతాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు రాఘవేంద్రస్వామి స్తోత్రపారాయణం, మంత్రపుష్ప పఠనం తర్వాత మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం రవీంద్ర స్వామీజీ భక్తులకు శ్రీగంధం, కుంకుమ, తులసి, పూజార్పిత పండ్లు అందజేశారు. అంతకుముందు స్వామీజీ మాట్లాడుతూ.... అనుకున్న పని నెరవేరాలంటే చేసేపనిలో శ్రద్ధ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ట్రస్టు నిర్వాహకులు అన్న వితరణ చేశారు. ఈనెల 20న మొదలైన రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి.

భక్తిశ్రద్ధలతో మధ్యారాధన




పూజలందుకుంటున్న రాఘవేంద్రస్వామి బృందావనం

అనంతపురం కల్చరల్: రాఘవేంద్రస్వామి 353 ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలో మొదటి రోడ్డు రాఘవేంద్రస్వామి మఠంలో మధ్యారాధన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావనానికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాది కైంకర్యాలు నిర్వహించా రు. అనంతరం స్వామివారి అ క్షింతలను భక్తులకు వితరణ చేశారు. మఠం మేనేజర్ బద్రీనాథ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వర్షం వచ్చిందంటే... పట్టాలు ఎక్కాల్సిందే..!

● ఏళ్లు గడుస్తున్నా తీరని సమస్య

● కల్లూరు వాసులకు తప్పని ఇక్కట్లు



రైల్వే అండర్ గ్రౌండ్‌లో నిలిచిన వర్షపు నీరు

గార్లదిన్నె, ఆగస్టు 21: చిన్న పాటి వర్షం వస్తే చాలు రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు నిలచిపోతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మండల పరిధిలోని కల్లూరు గ్రామం నుంచి ముంటిమడుగు వెళ్లే దారిలో కోట్లాది రూపాయులు ఖర్చు చేసి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించారు. లోతట్టు ప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించడంతో చిన్నపాటి వర్షం వస్తే చాలు వర్షపు నీరంతా అండర్ బ్రిడ్జిలోకి చేరిపోయి 4 అడుగుల వరకు నీరు నిలుస్తోంది. ఈ బ్రిడ్జి ద్వారా కల్లూరు నుంచి ముంటిమడుగు, కొత్తపల్లి, కొండకింద కొట్టాల తదితర గ్రామాల ప్రజల నిత్యం ప్రయాణిస్తుంటారు. వర్షపు నీరు నిల్చుతుండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పాఠశాలలో వెళ్లే విద్యార్థులు నీటిలో వెళ్లలేక తల్లిదండ్రులు, తెలిసిన వారి సాయంతో పక్కనే ఉన్న రైలు పట్టాలు దాటుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయాల్లో కల్లూరుకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రిడ్జి కింద ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు మోటర్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తూ తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు రైల్వే జీఎం గజానన మాల్యా, మరికొందరి దృష్టికి తీసుకెళ్లిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



మోటర్ల ద్వారా నీరు పంపింగ్ చేస్తున్నాం

- సీనియర్ సెక్షన్ ఇంజనీరు రవిబాబు

రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీటిని మో టర్ల ద్వారా ప్రతి రోజు పంపింగ్ చేస్తున్నాం. పెన్నానది సమీపంలో ఉండడంతో నీరు అధికంగా నిల్వ ఉంటున్నాయి. వర్షం వస్తే ఎక్కువ అయితాయి. అండర్ బ్రిడ్జిలో ఏర్పాటు చేసిన రెడ్ మార్క్‌వరకు నీరు ఉంటే ప్రజలు గమనించాలి.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



కల్లూరు రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలి. ప్రజాప్రతినిధుల, రైల్వే అధికారులు స్పందించాలి. సమస్య పరిష్కారం చేయాలని గతంలో కల్లూరుకు వచ్చిన రైల్వే జీఎం దృష్టికి, వైసీపీ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. ఫలితం శూన్యం. వర్షం వస్తే అండర్ బ్రిడ్జి కాలువను తలపిస్తోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు పరిస్థితి మరింత దైన్యం. సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి. **- చాంద్‌బాషా, కల్లూరు**

తాత్కాలిక చర్యలతోనే సరి



రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీటిని రైల్వే అధికారులు తాత్కాలిక చర్యలతోనే సరిపెడుతున్నారు. శాశ్వత పరిష్కారం చేయడం లేదు. వివిధ గ్రామాల నుంచి కల్లూరుకు వచ్చే ప్రజలకు రైల్వే అండర్ బ్రిడ్జి దారి తప్ప మరోదారి లేదు. వర్షం వస్తే కల్లూరుకు వచ్చే వారు రైల్వే పట్టాలపై దాటుకోవాల్సిందే. శాశ్వత పరిష్కారం చూపే విధంగా సమస్యను పరిష్కరించాలి.

- వడ్లరాము, కల్లూరు

ప్రజలకు ఇబ్బంది కలగనివ్వద్దు

రైల్వే బ్రిడ్జి అండర్‌పాస్‌లో నీటిని పంపింగ్ ద్వారా బయటికి తరలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని తహసీల్దార్ బండారు ఈరమ్మ అధికారులకు సూచించారు. బుధవారం ఆమె నీటి పంపింగ్ పనులను పరిశీలించారు.

ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికే ప్రత్యేక గ్రీవెన్స్

● కలెక్టర్ వినోద్ కుమార్



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ సమస్యలు పరిష్కరించేందుకే ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎస్సీ, ఎస్టీల కోసం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా బాధితులు పెద్దఎత్తున తరలివచ్చారు. మొత్తం 268 మంది తమ సమస్యలను విన్నవించుకున్నారు. కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం సమీక్షలో కలెక్టరు మాట్లాడుతూ దాదాపు ఐదేళ్ల తరువాత ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ చేపట్టామన్నారు. జిల్లా, డివిజన్, మండలస్థాయిలో ప్రతి బుధవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4గంటల వరకు విజిటింగ్ అవర్స్‌గా మీకార్యాలయాలలో నోటీస్‌బోర్డు తెలుగులో రాసి ప్రదర్శించాలన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కోటవీధి కాలనీ వాసులు

నార్పల, ఆగస్టు 21: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం తాగునీటి కోసం కాలనీవాసులు ధర్నా చేపట్టారు. ధర్నాకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. కోటవీధి కాలనీ మహిళలు మాట్లాడుతూ నెలన్నర నుంచి కాలనీకి నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనేక సార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు కాలనీకి నీటిని సరఫరా చేయాలని లేదంటే ధర్నా విరమించేది లేదని రోడ్డుపై బైఠాయించారు. ఎంపీడీఓ దివాకర్ స్పందించి రెండు రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. సీపీఐ నాయకులు గంగాధర్, సుధాకర్, ఆల్తాఫ్, చాపల రామాంజి, మహిళలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సిమెంట్ బస్తాలు పంపిణీ చేస్తున్న నారాయణచౌదరి

చెన్నేకొత్తపల్లి,ఆగస్టు 21: అర్హులందరికీ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి అన్నారు. బుధవారం గృహాలు మంజూరైన పలువురు లబ్ధిదారులకు ఆయన సిమెంట్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో నిజమైన పేదలను గుర్తించి వారికి పక్కాగృహాలు కట్టించి సొంతటి కల నెరవేర్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాన ధ్యేయమన్నారు. టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, ప్రధానకార్యదర్శి ముత్యాలప్ప, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలన

● కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, ఆగస్టు 21: జిల్లాలో 22ఏ నుంచి ఫ్రీహోల్డ్ అయిన భూములపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖలు కలిసి పునఃపరిశీలన చేపట్టాలని కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరు ఫ్రీహోల్డ్‌భూములపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జీఓ 596ప్రకారం జిల్లాలో 108ఎకరాల 309సెంట్ల భూములు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. వీటిపై అనేక ఆరోపణలు రావడంతో ప్రభుత్వం రీవెరిఫికేషన్ చేయాలని ఆదేశం చిందన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ భూముల వివరాలపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖలు సమన్వయంతో రీవెరిఫికేషన్ నిర్వహించాలని ఆదేశించారు. 22ఏనుంచి ఫ్రీహోల్డ్ భూములు ఒరిజనల్ వారే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారా,లేదా మరొకరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారా అనేదానిపై పూర్తిగా పరిశీలించాలన్నారు. భూములకు సంబంధించిన సర్వేనెంబర్లు వారిగా ఈఆఫీస్ ఫైల్ పెట్టాలన్నారు. ఈ విషయంలో రెవెన్యూ యంత్రాంగం కచ్చితమైన దిశలోనే ముందుకు వెళ్లాలని సూచించారు. తహసీల్దార్లు ఈ భూ సమస్యలను నాణ్యతగా పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్‌భార్గవ్,ఆర్డీఓలు శ్రీనివాసులురెడ్డి, రాణిసుష్మిత, నగరపాలక కమీషనర్ పీవీఎస్ఎస్‌మూర్తి, కలెక్టరేట్ ఈసెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, కలెక్టరేట్ ఏఓ మారుతి, సబ్‌రిజిష్టర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా రఘుప్రసాద్

అనంతపురం క్రైం, ఆగస్టు 21: అనంతపురం ట్రాఫిక్ సీఐగా రఘుప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సీఐగా ఉన్న నారాయణరెడ్డిని బదిలీ చేస్తూ రఘుప్రసాద్‌ను ట్రాఫిక్ సీఐగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఎస్పీ జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

శింగనమల సీఐగా కౌలుట్లయ్య

శింగనమల: శింగనమల సర్కిల్‌కు నూతన సీఐగా కౌలుట్లయ్య బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ శ్రీధర్ బుక్కరాయసముద్రం సర్కిల్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో కర్నూల్ జిల్లా సీఐడీలో పనిచేస్తున్న కౌలుట్లయ్య నియమితులయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చారించారు...

మామను హత్యచేసిన అల్లుడు

అనంతపురం క్రైం, ఆగస్టు 21: తరచూ అల్లుడిని మందలిస్తుండటంతో విసుగుచెందిన ఆ అల్లుడు మమానే అంతమొదించాడు. కక్కలపల్లికి చెందిన సర్దార్‌వలి(45) బైపాస్ రోడ్డు సమీపంలోని ఆర్‌కే ఫక్షన్ హాల్లో వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. అతని అల్లుడు జాఫర్ షాదిక్‌వలి వెల్డింగ్ పనిచేసేవాడు. రెండు నెలల క్రితం ఇద్దరి మధ్య వ్యక్తిగత కారణాలతో గొడవ జరిగింది. ఈ క్రమంలో షాదిక్‌వలి ధర్మవరంవెళ్లి నివసిస్తున్నాడు. రెండు రోజుల క్రితం సర్దార్‌వలి గతంలో అల్లుడు పనిచేసేచోటకు వెళ్లి.. వాడు లేడా అంటూ బండబూతులు తిట్టాడు. ఈ విషయం షాదిక్‌వలి చెవికిచేరింది. బుధవారం షాదిక్‌వలి కక్కలపల్లికెళ్లి సర్దార్‌వలిని కొడవలితో నరికాడు. తీవ్రరక్తగాయాలైన షాదిక్‌వలి అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా... ముగ్గురికి గాయాలు

నార్పల, ఆగస్టు 21: మండలంలోని బొందలవాడ గ్రామ సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బత్తలపల్లి నుంచి ప్యాసింజర్ ఆటో ప్రయాణికులను ఎక్కించుకుని నార్పలకు బయలుదేరింది. మార్గమధ్యలో బొందలవాడ గ్రామ సమీపంలో రామాంజనేయులు అనే గొర్రెల కాపరి గొర్రెలు మేపుతుండగా ఒక్కసారి పొట్టేళ్లు రోడ్డు వైపు పరుగులు తీశాయి. అటు వైపు నుంచి వస్తున్న ఆటోకు అడ్డుగా దూరాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సునీత, సూర్యుడు, చిన్నపరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 ద్వారా నార్పల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో రెండు పొట్టేళ్లు మృతి చెందాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వర్ష బీభత్సం

- పలు చోట్ల చెరువులకు గండ్లు
- కోతకు గురైన రోడ్లు, కొట్టుకుపోయిన వంతెనలు
- నీట మునిగిన పంటలు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు


బెళుగుప్ప మండలం బూదివర్తిలో నీటమునిగిన వరిపంటను చూపుతున్న రైతులు


కూలిన బెళుగుప్ప పెద్దవంక బ్రిడ్జిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు


కళ్యాణదుర్గం మండలం ముదిగల్లులో నీటమునిగిన కర్బూజా పంట


కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లిలో నిలిచిన వర్షం నీరు


రాయదుర్గం మండలం బీఎన్ హళ్లిలో మరువ పారుతున్న చెరువు


గుంతకల్లు మండలం కొంగనపల్లిలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్

బెళుగుప్ప, ఆగస్టు 21 : మండలంలో మంగళవారం రాత్రి కురిసిన కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో జనజీవనం అతలాకుతలమైంది. 89.8 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. నీటి ప్రవాహానికి బెళుగుప్ప పెద్దవంక బ్రిడ్జి కూలిపోయింది. బెళుగుప్ప నుంచి ఉరవకొండకు వెళ్లే పెనకలపాడు బ్రిడ్జిపై ఆదోనికి చెందిన టిప్పర్ గుండ్లపల్లికి వస్తుండగా నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. బూదివర్తి, శ్రీరంగాపురం గ్రామాల్లో 92 మంది రైతులకు చెందిన 236 ఎకరాల్లోని వరి, కంది, మొక్కజొన్న, వేరుశనగ, ఆముదం పంటలు నీటమునిగినట్లు వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలోని పెన్న, హగరి నదులు ప్రవహించాయి. పలు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. గంగవరం, శీర్పి, గుండ్లపల్లి చెరువులు నిండి మరువ పారాయి. బెళుగుప్ప, బ్రాహ్మణపల్లి, కోనాపురం, చెరువులకు 80 శాతం నీరు చేరింది.

కళ్యాణదుర్గం/ కళ్యాణదుర్గం రూరల్: ఆరుగాలం శ్రమించి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటలన్నీ వర్షం పాలయ్యాయి. దీంతో రైతులు నట్టేట మునిగారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో రైతు బడప్పకు చెందిన ముల్లంగి పంట మునిగిపోయింది. మండలంలోని ముదిగల్లు గ్రామంలో గోపాల్‌కు చెందిన రెండెకరాల పొలంలో టమోటా, ఇదే గ్రామంలోని రామాంజనేయులుకు చెందిన రెండు ఎకరాల కర్బూజా పంటలు నీట మునిగాయి. మల్లిపల్లిలో భారీ వర్షం కురవడంతో ఇళ్లలోకి నీరు చేరాయి. ముద్దినాయనపల్లి చెరువుకు గండి పడింది. కుందుర్పి మండలం తెనగల్లు ఎస్సీ కాలనీ వర్షపు నీటితో జలమయమైంది.

బ్రహ్మసముద్రం: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పాల వెంకటాపురం నుంచి బసంపల్లికు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. పీఆర్ ఏఈ విజయకృష్ణ, టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు తదితరులు బుధవారం ఆ రోడ్డును పరిశీలించారు.

రాయదుర్గంరూరల్: మండలంలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురవడంతో 85.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ రఘు తెలిపారు. భారీ వర్షానికి బీఎన్‌హళ్లి గ్రామాల్లో కాలనీలు జలమయమై వర్షపునీరు ఇళ్లల్లోకి చేరాయి. 10 గొర్రెపిల్లలు వరదనీటిలో కొట్టుకుపోయినట్లు గ్రామ రైతులు వాపోయారు. అదే విధంగా మండలంలో 15 పాత మిద్దెలు భారీ వర్షంకు తడిసి దెబ్బతిన్నట్లు తహసీల్దార్ తెలిపారు. అన్ని గ్రామాల్లో వాగులు వంకలు పొంగిపొర్లాయి. కొన్ని చెరువులు మరువ పారాయి.

ఉరవకొండ: ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో మంగళవారం రాత్రి 66మి.మీ.ల వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఉరవకొండలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆమిద్యాలలో ఊట్లమాను వద్ద వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వజ్రకరూరులోని కురుబవీధిలోకి నీళ్లు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఛాయాపురం సమీపంలో వంక ఉధృతంగా ప్రవహించడంతో చాయాపు రం- ఉరవకొండ దారిలో రాకపోకలు స్తంభించిపోయాయి. కొనకొండ్లలో ఆనంద్ అనే వ్యక్తికి చెంది మిద్దె పైకప్పు కూలిపోయింది.

విడపనకల్లు: మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కాలనీలు నీట మునిగాయి. అంచనహాలు గ్రామంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరటంతో ఆ గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. గడేకల్లు-ఆర్ కొట్టాల వంక, పొలికి-అంచనహాలు వంక ఉధృతంగా ప్రవహించటంతో రాక పోకలు నిలిచి పోయాయి. మండలంలో 43.6మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

కూడేరు: మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి 63,05 మీ.మీ.ల వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. చెక్ డ్యాంలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వేరుశనగ, కంది, ఆముదం, అరటి, చీనీ, టమోటా, వరి పంటలు నీట మునిగాయి.

గుంతకల్లు: భారీ వర్షాలకు మండలంలోని వంకలు నిండుగా పారుతున్నాయి. కొంగనపల్లి, ఓబుళాపురం, నాగసముద్రం, చింతలాంపల్లి గ్రామాల వద్ద వంకలు ఉధృతంగా పారుతుండటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొంగనపల్లి గ్రామం వద్ద మద్దికెర వంక కల్వర్టు మీదుగా నాపబండల లోడుతో వెళ్తున్న ట్రాక్టరు ఇరుక్కుపోయింది. స్థానికులు ప్రయాసమీద సాయంత్రానికి ట్రాక్టరును బైటకు తెచ్చారు. నాగసముద్రం, కొంగనపల్లి గ్రామాల వద్ద వంకల వల్ల దెబ్బతిన్న రోడ్లను, పాక్షికంగా కూలిన 10 ఇళ్లను తహసీల్దారు రమాదేవి బుధవారం సందర్శించారు.

గుత్తి: పట్టణంలో బుధవారం తెల్లవారు జామున భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక తోలుషాపు కాలనీ, సుద్ద ఫ్యాక్టరీ ఏరియాల్లో ఇళ్లల్లోకి నీళ్లు చేరాయి. అలాగే ఫారెస్టు కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయంలోకి నీరు వచ్చి చేరింది. బాలుర-1 ఎస్సీ వసతి గృహం జలమయమైంది. కాల్వలు, వంకలు పొంగిపొర్లాయి. పట్టణంలో రెండిళ్లు నేలకూలాయి. మండలంలో 60.8 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

గుత్తిరూరల్: మండలంలోని జక్కలచెరువు చెరువుకు చిన్న గండి పడింది. తహసీల్దారు ఓబులేసు, ఇరిగేషన్ డీఈ రవికుమార్, సీఐ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ పరిశీలించి మరమ్మతులు చేయించారు. వంకలు వాగులు పొంగి పొర్లాయి. ధర్మాపురం, బ్రాహ్మణపల్లి, కొత్తపేట, జక్కలచెరువు తదితర గ్రామాలో మొక్కజొన్న, టమోట, పత్తి పంటలు నీటమునిగాయి.

పామిడి : మండలంలో మూడు రోజులుగా వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పెన్నా నదికి జలకళ సంతరించుకుంది. మంగళవారం రాత్రి 53 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. రామగిరి చెరువుకు గండి పడడంతో నీరు పెద్దఎత్తున దిగువకు పారాయి. అలాగే అనుంపల్లి చెరువు నిండుకుండను తలపిస్తూ మరువ పారింది. సొరకాయలపేట-కండ్లపల్లి మధ్య గల వంతెన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. రామగిరి, వంకరాజుకాలువ గ్రామాలకు చెందిన రహదారులు అక్కడకక్కడ కోతకు గురై పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎదురూరు, అక్కజాంపల్లి గ్రామాల ప్రజలు రైల్వే వంతెన కింద నీరు పెద్దఎత్తున చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గజరాంపల్లి, నీలూరు, పొగరూరు గ్రామాల్లో పలు పంటలు నీటమునిగాయి. అలాగే పామిడి పట్టణం జలమయమైంది. స్థానిక బీసీ కాలనీ, వీకే ఆదినారాయణరెడ్డికాలనీ, కొత్తబస్టాండ్, వెంగమనాయుడు కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. వర్షపునీరు ఇళ్లల్లోకి చేరింది. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ సహాయక చర్యలు చేపట్టారు. నిరాశ్రయులకు ఉదయం, మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు. పెన్నా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పామిడి-కల్లూరు మీదుగా రాకపోకలు నిలిపివేశారు.

పుట్లూరు: మండలంలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వంకలు, వాగులు పొంగి పొర్లాయి. పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు వర్షపునీరు చేరుతోంది. పలుగ్రామాల్లో పత్తి, ఆముదం తదితర పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. 13.4 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.


మరువ పారుతున్న పామిడి మండలం అనుంపల్లి చెరువు


పామిడి మండలం సొరకాయలపేట-కండ్లపల్లి మధ్యలో కోతకు గురైన వంతెన


పామిడిలో నిరాశ్రయులకు అన్నదానం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు


విడపనకల్లు మండలం అంచనహాలులో జలమయమైన కాలనీ


గుత్తి ఫారెస్టు కార్యాలయంలోకి చేరిన నీరు


గుత్తిలోని మెయిన్ రోడ్డులో వర్షానికి కూలిన ఇల్లు

డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 21: ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీలో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పట్టణంలోని కేటీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఐగా బాధ్యతలు చేపట్టిన ఈరన్న

యాడికి, ఆగస్టు21: యాడికి అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఈరన్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన ఇక్కడికి వచ్చారు.

అనుమతి లేని లే-ఔట్లలో ప్లాట్లు కొనరాదు

గుంతకల్లు, ఆగస్టు 21: పట్టణంలో అనధికారికంగా వేసిన లే-ఔట్లను గుర్తించామని, ఆ లే-ఔట్లలో ప్లాట్లను కొనరాదంటూ మున్సిపల్ కమిషనరు వెంకట రమణయ్య పట్టణ ప్రజలను ప్రకటనలో కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే-ఔట్లలో స్థలాలను కొంటే ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరగదని, మౌలిక వసతులను కల్పించమని తెలియజేశారు. పట్టణ పరిధిలోని ఫైర్ ఆఫీసు వెనుక, కసాపురం రోడ్డులోని సర్వే నెంబర్ 310, 311, 314లలో, అలాగే ఉరవకొండ రోడ్డులోని సర్వే నెం. 369-బీసీ, 399, 400లలో, ఆర్డీటీ ఆఫీసు వెనుక గల సర్వే నెం. 586లో కొంత భాగం, 563-ఏ3, ఏ4లలో, సోనియాగాంధీ లే-ఔట్ పక్కన గల సర్వే నెం. 595లో , కురుబ వీధి, పాతగుంతకల్లు లోని సర్వే నెం. 492-ఏలో, పోర్టర్స్ లైన్‌లోని సర్వే నెం. 118లో, బళ్లారి రోడ్డులో గల సర్వే నెం. 403-ఏ2లో, గుత్తి రోడ్డులోని సర్వే నెం. 729-సీలో, పాతగుంతకల్లు, ఆర్డీటీ బిల్డింగుల దక్షిణంలో గల సర్వే నెం. 542లో ఉన్న లే-ఔట్లు అనధికారికమైనవని తెలిపారు.

23న ఇంటర్వ్యూలు

బొమ్మనహాళ్, ఆగస్టు 21: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ సబ్జెక్టు లెక్చరర్ పోస్టు భర్తీకి ఈ నెల 23వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఎంఏలో పొలిటికల్ సైన్స్, అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

తాగునీటి పైప్‌లైన్ ప్రారంభం

గుంతకల్లు, ఆగస్టు 21: పట్టణంలోని బీటీ పక్కీరప్ప కాలనీలో ఏర్పాటుచేసిన తాగునీటి పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి ప్రారంభించారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం అత్యవసరంగా రూ. 6 లక్షల వ్యయంతో పైప్‌లైన్‌నుఏర్పాటు చేయగా నా రాయణ స్వామి బుధవారం ఉదయం ప్రారంభించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరిస్తాం

గుంతకల్లు, ఆగస్టు 21: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలను పరిష్కరించి రోగులకు అత్యుత్తమ సేవలు అందేలా కృషిచేస్తామని ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి పేర్కొన్నారు. స్థానిక రాయ్‌సాహెబ్ మిడతల హంపయ్య సర్వజన ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆయన సందర్శించారు. సమస్యలను రోగులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత మాట్లాడుతూ సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని సూపరింటెండెంటు విష్ణువర్ధన్ రెడ్డికి తెలిపారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 21: రేకులకుంట, ఆవులదట్ల, కదరంపల్లి, నాగిరెడ్డిపల్లి, వేపరాళ్ల , 74 ఉడేగోళం గ్రామాల్లో బుధవారం పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి పశువులకు గాలికుంటునివారణ టీకాలు వేశారు. సర్పంచ్ ఎర్రిస్వామిరెడ్డి, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.


బొల్లనగుడ్డంలో కబడ్డీ పోటీలు

బొమ్మనహాళ్, ఆగస్టు 21 : మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేరుపై స్థానిక టీడీపీ నాయకులు కబడ్డీ పోటీలు నిర్వహించారు. జట్లు వివిధ గ్రామాల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. జట్లు హోరాహోరీగా తలబడ్డారు. మొదటి బహుమతిని బొల్లనగుడ్డం గ్రామ జట్టు, రెండవ బహుమతి కళ్లహోళ గ్రామ జట్టు గెలుకున్నారు. మొదటి బహుమతి రూ. 6,116, రెండవ బహుమతి రూ. 3,116లను మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ కొత్తపల్లి మహేంద్ర చేతుల మీదుగా అందించారు. మాజీ జడ్పీటీసీ గోపాల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 21: పట్టణంలోని మోడల్ కళాశాలలో విద్యార్థులకు మహిళలపై జరుగుతున్న దాడులు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐడబ్ల్యు విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ సీఐ వెంకటరమణ, ఇన్‌చార్జ్ తహశీల్దార్ రఘు పాల్గొని మాట్లాడారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. అదే సమయంలో అబ్బాయిలకు అక్క, చెల్లి, తల్లి బంధాల్లోని మాధుర్యాన్ని చిన్నప్పటి నుంచే అర్థమయ్యేలా వివరించాలన్నారు. సినిమాలకు, సామాజిక మాధ్యమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, విద్యార్థినులు ఏ సమస్య వచ్చినా 100 కు డయల్ చేయాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరి బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయక కార్యదర్శి అంజి, ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొత్రేష్, పార్వతికుమార్‌నాయక్, ఏపీ రైతు సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు తిప్పేస్వామి, నరసింహులు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


గుంతకల్లులోని డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న విజయ కుమార్

గుంతకల్లు, ఆగస్టు 21: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని పట్టణంలోని మజ్దూర్ యూని యన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం పలువురు మహిళలతో కలిసి స్థానిక మజ్దూర్ యూనియన్ కార్యాలయం నుంచి ర్యాలీగా డీఆర్ఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసులో రాజకీయాలకు అతీతంగా విచరణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఏడీఎస్ అశ్విని, కోశాధికారి శ్రీనివాస శర్మ, విశ్రాంత రైల్వే ఉద్యోగుల సంఘం డివిజనల్ కార్యదర్శి శ్రీనివాస మూర్తి, బ్రాంచ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, మున్సిపల్ వర్కర్లు, విద్యార్థులతో కలిసి పట్టణంలోని కణేకల్లు రోడ్డులో గల ప్రభుత్వ హైస్కూల్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ జూనియర్ వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన దుండగులకు కఠినమైన శిక్ష పడే వరకు ఆమె కుటుంబానికి అండగా ఉంటూ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ, వర్కర్ యూనియన్ నాయకులు రాధమ్మ, లక్ష్మి, విద్యార్థులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కణేకల్లు: కోల్‌కతాలో వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినమైన శిక్షలు వేయాలని సీపీఐ అనుబంధ ఎస్ఎఫ్ఐడబ్ల్యూ మహిళా సమాఖ్య నాయకురాళ్లు పద్మావతి, పార్వతి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు డిమాండ్ చేశారు. అబుదాబీ, అసీనా, లలిత, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం


యాడికిలో నిరసన తెలుపుతున్న మాలమహానాడు జేఏసీ నాయకులు

యాడికి, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాలమహానాడు జేఏసీ నాయకులు తెలిపారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టిన భారత్‌బంద్‌లో భాగంగా మండల కేంద్రంలో మాల మహానాడు జేఏసీ నాయకులు నిరసన చేపట్టారు. గాంధీ విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణను వర్గీకరణను తామంతా మూకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఈ మేరకు వినతిపత్రంను డిప్యూటీ తహశీల్దార్ బాలమ్మకు అందజేశారు. మాలమహానాడు జేఏసీ నాయకులు విజయ్, రత్నకుమార్, ప్రసాద్, సురేష్, ఓబయ్య, బాలన్న, మత్తయ్య, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన భారత్‌బంద్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మాలమహానాడు నాయకులు ర్యాలీ నిర్వహించారు. సీబీరోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ చేయరాదంటూ రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. నాయకులు విజయ్‌కుమార్, ప్రభాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: ఎస్సీ వర్గీకరణ వద్దు అంటూ మండల కేంద్రంలో మాల మహానాడు నాయకులు, మాలలు స్థానిక 42వ జాతీయ రహదారిపై రాస్తా రోకో నిర్వహించారు. భారత్ బంద్‌లో భాగంగా అన్ని కార్యాలయాలను బంద్ చేయించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని వర్గీకరణ చేయరాదంటూ డీటీ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించారు. నాయకులు ఎంబీ చెన్నరాయుడు, మాల గోవిందు, శేఖర్, రాజు, మదన్, మురళి, వీరేంద్ర, అరుణ్ కుమార్, లెనిన్ బాబు, శీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు

ఉరవకొండ, ఆగస్టు 21: మండలంలోని వైరాంపురం, షైలారంపల్లి గ్రామాల్లో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఉరవకొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి దుర్గాకల్యాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వై రాంపురంలో జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. విద్య ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. తహసీల్దారు మహబూబ్ బాషా, ఏవో జయరాములు పాల్గొన్నారు.

ఉపాధిపనుల గుర్తింపునకు గ్రామసభలు

కళ్యాణదుర్గం(శెట్టూరు), ఆగస్టు 21: మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీలలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనుల ఎంపిక కోసం ఈ నెల 23వ తేదీన గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

యాడికి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనుల గుర్తింపు కోసం ఈనెల 23న గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొత్త పనులు గుర్తించుట, పరిపాలన మంజూరు కోసం పంపడం గురించి చర్చించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

మొక్కజొన్న పంట పరిశీలన

యాడికి, ఆగస్టు 21: మండలకేంద్రంలో మాబు అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను రేకుల కుంట వ్యవసాయ పరిశోధనకేంద్రం శాస్త్రవేత్తలు రమేష్‌నాయక్, లక్ష్మణ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటను ఆశించే తెగుళ్ల నివారణ చర్యలపై రైతుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏఓ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 21 : పట్టణంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. కళాశాలలో అధ్యాపకులు తయారుచేసిన ఐదు సంవత్సరాల రికార్డులను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పరిశీలించారు. కళాశాలలకు సంబంధించి పలు అంశాలను విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాక్ కోఆర్డినేటర్ సూర్య నాగిరెడ్డి, పీడీసీ మల్లికార్జున, దేశం శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ వాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సమస్యలపై కలెక్టర్‌కు వినతి

కళ్యాణదుర్గం, ఆగస్టు 21: కంబదూరులోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తిమ్మాపురం గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు శివన్న, వెంకటేష్, ప్రకాష్‌లు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పిల్లల చదువు అంతంతమాత్రంగానే ఉందన్నారు. తాగునీటి వసతిసరిగా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భోజనం కూడా సరిగా పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించి తదుపరి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడిపత్రి, ఆగస్టు 21: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం శంకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలను 9959225856కు ఫోన్‌చేసి తెలపాలని కోరారు.

వైభవంగా మధ్యారాధన


తాడిపత్రిలో విశేష అలంకరణలో రాఘవేంద్రుడి బృందావనం

తాడిపత్రి, ఆగస్టు21: పట్టణంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో మూడురోజులుగా జరుగుతున్న ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి బృందావనానికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, అష్టోత్తర పారాయణం, తులసీ అర్చన, హస్తోదకం, మహామంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బృందావనాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.

గుత్తిరూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లిలో గల ఆనంద ఆశ్రమంలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. అర్చకులు ఉదయమే స్వామివారి మూలవిరాట్‌కు అష్టోత్తర పారాయణం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం వివిధపుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామంలో ఊరేగింపు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

నెట్టికంటికి తిరుమంజన స్నపనం

గుంతకల్లు, ఆగస్టు 21: పూర్వాభాద్రా నక్షత్ర సంక్రమణం కారణంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి ఉత్సవ విగ్రహానికి తిరుమంజన స్నపనం చేసి, మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని యాగశాలలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి అలంకారాలు చేసి అర్చనలు చేశారు. ఆలయ వేద పండితుడు రామకృష్ణావధాని, అర్చకులు పాల్గొన్నారు.

గుప్తనిధుల ముఠా అరెస్టు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 21: రాయదుర్గం నియోజకవర్గంలో ఆలయాలను టార్గెట్ చేస్తూ గుప్తనిధులు కొల్లగొట్టడానికి పాల్పడుతున్న ఒక ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవిబాబు తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం పట్టణ సమీపంలోని కుంటుమారమ్మ ఆలయం వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రాయదుర్గం వైపు నుంచి వస్తున్న కేఏ 7097 నంబర్ గల కారులో ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించి వెంబడించామన్నారు. అయితే ముగ్గురిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారయ్యారన్నారు. కారులో గ్యాస్ కట్టర్, సిలెండర్, గుణపాలు, సుత్తిలు ఉన్నట్లు గుర్తించామన్నారు. గుప్తనిధుల కోసం కర్ణాటక రాష్ట్రం అశోక సిద్ధాపురం వైపు పోతుండగా పట్టుకున్నామన్నారు. శింగనమలకు చెందిన విజయకుమార్, పెద్దవడుగూరు మండలం మిడుతూరుకు చెందిన శివశంకర్, బోయ వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా ఈ గ్యాంగ్‌కు సంబంధించిన ఇద్దరు వ్యక్తులు పట్టణానికి చెందిన వన్నూరువలి, నబీఖాన్ వైఎస్సార్ సర్కిల్ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన


వెంకటేశ్వరకాలనీలో బాధితులతో మాట్లాడుతున్న కాలవ భరత్

రాయదుర్గం రూరల్, ఆగస్టు 21: భారీ వర్షానికి పట్టణంలో కొలిమివీధి, రామస్వామివీధి, వెంకటేశ్వరకాలనీ, లక్ష్మీబజార్ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇళ్లల్లోకి నీరు చేరాయి. దీంతో నిత్యావసర వస్తువులు తడిసి పనికిరాకుండా పోయాయి. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మా ట్లాడారు. ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు, నాయకులు పొరాళు పురుషోత్తం, గాజుల వెంకటేశులు, గోనబావి రమేష్ తదితరులు పాల్గొన్నారు.